## కులానికి గోత్రానికి కొలబుర్రలు తలిదండ్రులే!

గోదావరి తీసింది. లంకలు మళ్ళా బయలుపడ్డాయి. ఒడ్డులమీద రెల్లు తెల్లగా పూసింది. మఱి వరద వస్తుంది అన్నభయం ప్రజల్లో పోయింది. అకర్ర ఈకర్ర ఉంటే ఊళ్లోకి జేరేసి కుంటూ, పాటకపుజనం పనిపాటల్తో మెలగజొచ్చారు. గట్టుమీద రావిచెట్టుక్రింద కొందరు కొందరు మగవాళ్ళుచేరి తీరిగ్గాకూచుని కబుర్లు చెప్పుకుంటూ వున్నారు. ఎండకానైతే తీవ్రంగా కాస్తూ వుంది. కానీ ఇంకా గోదావరినీరు ఎఱ్ఱగా ప్రవహిస్తూ నేల తేమగా వుండడంచేత, చెట్టునీడ అదో ఆశ్రయమిస్తూ ఇంపు గొల్పుతూవుంది. దూరాన్నే కొండలు ప్రకృతిశోభను విరాజిల్లుతూ వున్నాయి. నీటిమీద నావలు నడాడుతూ వున్నాయి. చుట్టుపట్ల అంతాకూడా చూడసొంపుగా వుందనడంలో అతిశయోక్తి ఏమీలేదు.

ఒక చాకెత మంచివయస్సులోవున్నది. నీళ్ళల్లోంచి యివలకు వస్తూ, ఎలావుందంటే అలావుంది. శ్రమ, సరాగం రెండూకూడ యొకవిధమైన జాలి, సంతోషంకూడా చూపఱకు కనబరుస్తూ వుంది. ఆదాకా ఆరబట్టిన, ఒక చక్కని మామిడి పిందె అంచులుగల, పలాచటి తెల్లటిచీర,—ఎవరిదైతేం ఆ నిమిషమప్పుడు దానిదే అనుకోవాలి—ఏరికోరి ఉతుక్కుని, ఆరేసుకుని, వెంటనే తాను ధరించింది. చూడ్డానికి పొడుచుకున్నాయి చూచుకాలు సూర్యకిరణాల్లాగు. మరిన్ని కాళ్ళు తుడుచుకుంటూ పాదాలకు ఆకుజోడు తొడిగింది. ముందు బట్టల మూటలు రెండు కావడివన్ని మోఋస్తూవుంది—ఒకచాకలి కుఱ్ఱవానిచేత—బహుశా వాడు ఆమెకు తమ్ముడు అని నా వూహ!

వాడు కావడి ఊపున నడుస్తూవున్నాడు. అది వెనుకనే టీగ్గా అడుగులేస్తూ వుంది. "పచ్చిపేగుల్తో ఆ మూటలు

నే నెత్తుకోగల్దునా చెప్పండీ! అని అడిగింది. దానికి దారిచ్చే ఒక బ్రాహ్మణ్ణి తప్పుకోమంటూ చిరునవ్వు నవ్వి. "పచ్చిపేగు లేమిటి? ఎండుపేగు లేమిటి? అన్ని పేగులూ సరిసమానంగానే పనిచేస్తున్నాయి ఈ రోజుల్లో" అనేడు బ్రాహ్మడు తప్పు కుంటూ. బ్రాహ్మడుకూడా మంచి పదునులో ఉన్నవాడే. కులానికి బ్రాహ్మడుగాని పలకరించడంలో అన్ని వర్ణాలవారిని పలుకరిస్తూనే వుంటాడు; అదే నేటి సాంఘికపు మతలబీ అని అంటూ.

ఆ వెనకాలే చాకలివాడు దాని భర్త అయివుంటాడు. ఆదాకా దారికడ్డంగా కట్టినబట్ట లూడతియ్యగా మిగిలిన వెదురు కర్రలు అవీయివీ బుజాన్ని వేసుకుని, దగ్గఅలోనే వలలారేసు కుంటూ, చేప నొకదాన్ని, పల్లెవాళ్ళమ్మేదాన్ని కొనుక్కొని వ్రేలాడపట్టుకొని వస్తూవస్తూ ఆ బ్రాహణ్ణి చూచి, " మీవేమైనా ఇస్త్రీచేసే బట్టలున్నాయా? దాన్ని అలా పలుకరిస్తున్నారు! ఇస్త్రీ చేసేవాణ్ణి నేను. ఉతికేది అది! ఏమైనావుంటే నాతోటి చెప్పండి! మీరెంత బామ్మర్లైనా సరాసరి మాట్లాడకూడదు!" అని అన్నాడు.

బ్రాహ్మణుడు దంగుపోయాడు. "అదేమో జోడు తోడు క్కొని బ్రదుకు కొలమానంయొక్క హెచ్చుతరగతిని నడుస్తూ, అంతా ఒకే సంఘమన్నట్టు పోతూవుంది, వాదేమో కులవృత్తి మరువకుండా మాట్లాడుతున్నాడు" అని ఓ విధంగా విస్తుపోతూ ఆ చాకలివాని వంక పునః చూచాడు.

చాకలివొంటిని ఒక పుట్టగోచీ మాత్రమే వుంది. కాని మండాదండా విజృంభించి కాయ ముప్పొంగియున్నట్లుగా పడ్డాడు. బ్రాహ్మణుడు కొంచెము వొదిగినట్లయి "ఒరే! చాకలీ! ఈ రోజులు వర్ణసంకరపు రోజులు. బ్రాహ్మణులు జోళ్ల అమ్మ

తున్నారు. మాదిగలు మంత్రాలు చెబుతున్నారు. సంఘమంతా ఏకమైయుంది. మేమున్నూ ఇస్త్రీ చేయడం నేర్చుకున్నాము. ఎటొచ్చీ మేం వేదంతోటో, గాయత్రీతోటో ఆ పనులు అన్నీ చేసుక్కుంటున్నాము. మీరు ద్విజులుకారు కాబట్టి కారుకూతలు కూసుకుంటూ ప్రవర్తిస్తూ వున్నారు" అని అన్నాడు "ఏమో! శాస్త్రాలు వినడంలో వింటూ వచ్చాను. బ్రాహ్మణుడు మగడు మాదిగది భార్యా. కృతయుగంలో ఉండేదటగా! మళ్ళీ అదే యుగం రావాలని అంటున్నారు అంతాను. సంఘమంతా ఒకటే. సంతోషమంతా ఒకటేటగా! ఇన్ని తేడాలు లేవటగా! మీరు జంద్యాలు చాకిరేవు కెయ్యవచ్చు. మాం తెల్లబట్టలూ కట్టొచ్చు. ఎటొచ్చీ "ప్రేమ" అనేది కుదరాలి మనకాలా మనకూ. ప్రేమఅంటూ కుదిరితే, పేలినవళ్ళు, పేలనివళ్లు వొకటే— అప్పుడే అన్నింటా సమానమైన సంఘం! అయినా దానికేసి మరి చూడబోకండి మీరెంత బామ్మర్లైనా!" అని బూకరిస్తూ వెళ్ళిపోయాడు చాకలి. చాకల్ది ఎప్పట్లాగే బ్రాహ్మణ్ణిచూస్తూ చిరునవ్వు నవ్వి "ఆడికేం తెలుసు. తాగివున్నాడు" అని అంటూ తాను తనమగడు మళ్ళిన సందులోకి మళ్ళిపోయింది. ముందు తమ్ముడూ కావడీ, వెనకాల అదీ దాని చెడావులూ! బ్రాహ్మణుడు నాటిసంఘాన్ని సంఘమర్యాదను గురించి ఆలోచిస్తూ మఠోసందులోకి నిష్క్రమించేడు.

అయితే ప్రేమ లెక్కడికిపోతాయి! శరీరాలు కలియక పోయినా, అంతా ఒకటి కాకపోయినా, ఈ ప్రేమలనేవి సహజ సంపత్తితో కూడుకున్నది అనుకోండి పాఠకులు. కనుపాపల చూపుల్లోనే ప్రేమలు, పలికే పలుకుల్లోనే ప్రేమలు, చేసే

చేతల్లోనే ప్రేమలు. ఈ ప్రేమలన్నవి స్వభావసిద్ధాలు. వీటిని తప్పడం బ్రహ్మతరం గాదు. మనిషిఅయ్యాక మనిషిని కుక్క అయ్యాక కుక్కను, మేకపిల్లలయ్యాక మేకపిల్లను, పరిశీలిస్తూ, పలుకరించడంలాగు, ముద్దెట్టుకున్నట్టు, మూచూచినట్టు, వుంటూ వుండడం లేదూ ! అసలు రెండూ ఒకజాతికి సంబంధించి వుండ నక్కరలేదు. ఒక ఆబోతుతో ఒకకుక్క చెరలాడ్డం ఓపర్యాయం చూచాను.

ఆదిని చైతన్యం అనేది మనలోవుండాలి. ప్రీతి అనేది మనలో వుండాలి. అప్పుడు ఈ జగత్తుఅంతా ఒకటి అయి మనలో ప్రదీపిస్తుంది. ఇదే సాంఘికమతంబని తయారయ్యే నేటి సంఘ మని నా వూహ ! ఈలాగ్గా పోసాగయినా తలపులు ఆ దృశ్యాన్ని చూచినప్పుడు, పెద్ద వేదాంతంలో పడ్డాను నేను ఇదంతాచూచి.

అయితేనేం ఇంటికి చేరుకునేసరికి, దాని మొగుడు బిడ్డను ఎత్తుకుని ముద్దాడుతూ " ఒసేవు యీడు చక్కని బామ్మడౌతా దేవ్ " అన్నాడు. " ఈడు పెద్దాడయ్యేసరికి చాకల్లే బామ్మల్ల కంటె ఎక్కువ సతికిన వాళ్ళవుతారు " అంది అది. వాడు " ఇప్పుడే వుంది సామెత అల్లాఅవుతే శాస్త్రం, చదివినాడుకంటె చాకలిమేలు " అని అన్నాడు.

ఆ చంటిపాపకు అసలు కులంగోత్రం తెలియదు. అది నిస్సహాయత అనుకోక ? ప్రేమఅనుకోక ? వాని కులానికి గోత్రానికి ఆ తలిదండ్రులే కొలబద్రలు.

సం పూ ర్ణ ము.

రాజేశ్వరి ప్రెస్, రాజమండ్రి.